ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 7 మే 2024



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

» మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

షాద్‌నగర్ అర్బన్, మే 6: లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. సోమవారం షాద్‌నగర్‌లో ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ను, ఈవీఎంలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ వెంకట మాధవరావును అడిగి ఎన్నికల ఏర్పాట్లను తెలుసుకున్నారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట షాద్‌నగర్ సీఐ ప్రతాపలింగం, ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథి, తదితరులు ఉన్నారు.



వానాకాలానికి సన్నద్ధం

రానున్న వానాకాలం పంటలకు సరిపడా ఎరువులు సిద్ధం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే జిల్లాలో ప్రైవేట్ ఎరువుల డీలర్లు, సొసైటీల గోడౌన్లలో 18,803 టన్నుల వరకు వివిధ రకాల ఎరువులను సిద్ధంగా ఉంచారు. కాగా వానాకాలం పంటలకు జిల్లాలో లక్ష టన్నుల వరకు కాంప్లెక్స్ ఎరువులు, యూరియా అవసరం కానున్నాయి. ఈ మేరకు రైతుల డిమాండ్‌కు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అధికారులు క్షేత్రస్థాయిల్లో తనిఖీలు నిర్వహిస్తూ ఏ ఎరువులు ఎంత మేర అందుబాటులో ఉన్నాయన్న లెక్కలు తీస్తున్నారు. నకిలీ ఎరువులు, విత్తనాల బెడదను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన ఎరువుల్లో తొలకరి వర్షాల నాటికి సగం వరకు అందుబాటులో ఉంచేలా వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది.



ముందస్తుగా సరిపడా ఎరువుల నిల్వలు

» క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీలు
» జిల్లాకు లక్ష టన్నులపైగా ఎరువుల అవసరం
» ఇప్పటికే 18,803 టన్నుల రసాయన ఎరువుల నిల్వ
» తొలకరి నాటికి 50 శాతానికి పైగా ఎరువులు సిద్ధం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : వచ్చే ఖరీఫ్‌కు వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది ముందే రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేయడంతో రైతులకు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తోంది. గతంలో కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరత ఎదురవడంతో ఈ ఏడాది ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఎరువులు డీలర్లు, మార్క్‌ఫెడ్ వద్ద అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్నారు. సొసైటీలు, డీలర్ల వద్ద డీఏపీ, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల లభ్యతపై వ్యవసాయ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నిల్వలు, వానకాలం పంటలకు అవసరమయ్యే ఎరువులపై లెక్కలు తీస్తున్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు రోజువారీ పర్యటించి తమ పరిధిలో ఉన్న డీలర్ల దగ్గర ఎరువుల నిల్వలను తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు.

రెండు జిల్లాల్లో పెరిగిన ఎరువుల వినియోగం

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగినట్లు గత ఏడాది ప్రభుత్వ ఆర్థిక సర్వేలో వెల్లడైంది. అయితే ఇదే సమయంలో మేడ్చల్ జిల్లాలో దాదాపు సగానికిపైగా ఎరువుల వినియోగం తగ్గడం గమనార్హం. గతంతో పోలిస్తే ఎరువుల వినియోగంలో రాష్ట్ర సగటు పెరుగుదల 19శాతం ఉండగా వికారాబాద్‌లో 29.2శాతం(రాష్ట్రంలో 16వ స్థానం) ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లాలో 10.6శాతం పెరుగుదల(రాష్ట్రంలో 23వ స్థానం) నమోదైంది. ఇక మేడ్చల్ జిల్లాలో దాదాపు 52.5శాతం ఎరువుల వాడకం తగ్గింది. ఇక్కడ స్థూలసాగు పెరిగినా ఎరువులు వినియోగం ఇంతపెద్ద స్థాయిలో తగ్గడం గమనార్హం. అంతేకాదు రాష్ట్రంలోనే మేడ్చల్‌లో ఎరువుల వినియోగం అతి తక్కువగా ఉండడం మరో విశేషం.

వాస్తవానికి ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే 50శాతం విత్తన, ఎరువులు మార్కెట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఈ మేరకు ఈ ఏడాది కూడా ప్రైవేటు డీలర్లతో పాటు సొసైటీల వద్ద తగిన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎరువులు కొనుగోలుకు ప్రతిరైతు తప్పనిసరిగా పట్టాదారు పాస్ పుస్తకం ఒరిజినల్, జిరాక్స్, ఆధార్ జిరాక్స్ ధ్రువపత్రాలను ఇవ్వాల్సి ఉంటుంది. ఇవి తీసుకెళితేనే సబ్సిడీపై ఎరువులు అందజేస్తారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు తప్పకుండా బిల్లులు తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. గరిష్ఠ ధర, సబ్సిడీ వివరాలు ఎరువుల బస్తాపై స్పష్టంగా రాస్తారు. వీటిని గమనించి రైతు తీసుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే ఈ ఖరీఫ్‌లో జిల్లాలో దాదాపు లక్షన్నర హెక్టార్లలో పంటలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అత్యధికంగా 60వేలకుపైగా హెక్టర్లలో పత్తిసాగు చేసే అవకాశాలు ఉన్నాయి. తరువాత జొన్న, మొక్కజొన్న, వరి పంటలు ఎక్కువగా రైతులు సాగు చేస్తున్నారు.

రంగారెడ్డి జిల్లాలో అందుబాటులో ఉన్న ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

రకం	టన్నులు
యూరియా	14,471
డీఏపీ	876
ఎంఓపీ	225
కాంప్లెక్స్	3,051
ఎస్ఎస్పీ	180
మొత్తం	18,803

లక్ష టన్నులు అవసరం

జిల్లాలో ఖరీఫ్‌లో లక్ష టన్నుల వివిధ ఎరువులు అవసరం అవుతాయని అంచనా. ఇందులో తొలకరి జల్లులు కురిసే నాటికి అంటే జూన్ మొదటి వారం నాటికి 50వేల టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచాలి. అయితే ఇప్పటికే 18వేలకుపైగా టన్నులు సిద్ధంగా ఉంచారు. దశల వారీగా అన్ని మండలాల్లోని పీఏసీఎస్, డీలర్ల వద్దకు చేరుస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువ అందుబాటులో ఉన్నాయి. రైతులు ఎక్కువగా వినియోగించే డీఏపీ నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అయితే సీజన్ ఆరంభం నాటికి డీఏపీ నిల్వలు సరిపడనంతగా అందుబాటులో ఉంచుతామని అధికారులు చెబుతున్నారు. డీఏపీ స్థానంలో కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవచ్చని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

ఎరువుల, విత్తనాలు సిద్ధం చేస్తున్నాం

జిల్లాలో వానాకాలం సీజన్‌కు సరిపడా ఎరువుల, విత్తనాలను సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలతో ఎరువుల డీలర్లు, సొసైటీల గోడౌన్లలో విత్తనాలు, ఎరువుల నిల్వలు తనిఖీ చేస్తున్నాం. రైతుల డిమాండ్‌కు సరిపడా తొలకరి నాటికి ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచుతాం. ఈ విషయంలో రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం జిల్లాలో 19వేల టన్నుల వరకు ఎరువుల నిల్వలు ఉన్నాయి. దశలవారీగా ఎరువుల నిల్వలు పెంచుతాం.

- గీతారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

నా పనితీరు నచ్చితేనే ఓటెయ్యండి

ఐదేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేశా
కొందరు కుల, మతాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారు
ప్రజలంతా ఆలోచించి ఎన్నికల్లో ఓటు వేయాలి
నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా
సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

గడిచిన అయిదేళ్ల కాలంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని, ఈ సారి మళ్లీ గెలిపిస్తే అన్ని విధాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జి. రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల లోక్‌సభ బరిలో రెండోసారి దిగిన ఆయన నియోజకవర్గమంతా విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మళ్లీ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అయిదేళ్ల కాలంలో నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉన్నానని, తన పనితీరు నచ్చితేనే ఈ ఎన్నికల్లో ఓటు వేయాలని ఓటర్లను కోరుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారో ఆయన మాటల్లోనే...



అయిదేళ్లలో విరామం లేకుండా పనిచేశా

గడిచిన అయిదేళ్ల కాలంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమస్యల

మిగతా 6వ పేజీలో...

నిప్పుల వర్షం!

» భానుడి భగభగలతో ప్రజలు విలవిల
» నాగారంలో అత్యధికంగా 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత

రంగారెడ్డి అర్బన్/వికారాబాద్, ఆంధ్రజ్యోతి, మే 6 : ఉమ్మడి జిల్లాలో నిప్పుల వర్షం కురుస్తోంది. సూర్యుడి భగభగలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఉమ్మడి జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు చాలా చోట్ల 45 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. వడగాలులు వీస్తున్నాయి. మరో మూడు, నాలుగు రోజులు వాతావరణ పరిస్థితులు ఇలాగే ఉండే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా. సోమవారం వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం నాగారంలో 45.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మేడ్చల్ జిల్లా కీసరలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా కాశీంపూర్‌లో 44.5, తాండూరులో 44.15, దౌల్తాబాద్‌లో 44 డిగ్రీలు, వికారాబాద్‌లో 43.5, కోట్‌పల్లి, పెద్దేముల్‌లలో 43.3డిగ్రీల చొప్పున, పెద్ద ఉమ్మెంతాల్‌లో 43.2, ధారూరు, మర్పల్లిల్లో 43.1 డిగ్రీలు, పూడూరు మండలం మన్నెగూడలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాలాల్‌లో 42.9, దౌలాపూర్ 42.9, నవాబ్‌పేట్, ముజాహిద్‌పూర్‌లలో 42.8, దుద్యాల్‌లో 42.7, మోమిన్‌పేట్, కొడంగల్‌లలో 42.5, బషీరాబాద్‌లో 42.4, ఏఆర్ఎస్‌లో 42.3, చౌడాపూర్‌లో 41.9, బొంరాస్‌పేట్‌లో 41.5, బొంరాస్‌పేట్‌లో 41.5, రాపోల్‌లో 41.3, మద్గుల్ చిట్టంపల్లిలో 42.1, పరిగి, మదన్‌పల్లిలో 41.1, దోమలో 40.6 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఓటింగ్ ప్రక్రియలో ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలించాలి

» మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతుల్లో కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మే 6 : ఎన్నికల్లో కీలకమైన ఓటింగ్ ప్రక్రియలో ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. మైక్రో అబ్జర్వర్లకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా శిక్షణ కార్యక్రమానికి విచ్చేసి మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన బాధ్యతలు కేటాయిస్తామన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు సంబంధించిన ప్రతీ అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు ఉదయం 7 గంటల సమయానికే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామగ్రి సక్రమంగా అందిందా? లేదా పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ నిర్వహించారా లేదా పరిశీలించాలని, ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకే మాక్ పోల్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని కలెక్టర్ చెప్పారు. ఒకవేళ ఏజెంట్లు ఎవరూ హాజరు కాని పక్షంలో 15 నిమిషాలు వేచిచూసి తర్వాత మైక్రో అబ్జర్వర్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మాక్ పోల్ అనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియలు నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా గమనించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించాలని తెలిపారు ఎక్కడైనా సాంకేతిక లోపాలతో ఈవీఎంలు పనిచేయకుంటే వాటి స్థానంలో వేరేవి ఎలా అమర్చుతున్నారనేది పరిశీలన చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వర్తిసున్న విధులు, టెండర్, ఛాలెంజ్ ఓటింగ్‌లు జరిగితే వాటి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించడం వరకే మైక్రో అబ్జర్వర్ల బాధ్యత అని, ఎక్కడా పోలింగ్ విధుల్లో జోక్యం చేసుకోకూడదని కలెక్టర్ సూచించారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలను గమనిస్తూ, ఎప్పటికప్పుడు వాటిని జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైక్రో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఆరు గంటల లోపు పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన ఓటర్లు ఇంకా మిగిలి ఉంటే, వారిని వరుస క్రమంలో నిలబెట్టి చివరి నుండి ముందు వరుసలో ఉన్న ఓటరు వరకు క్రమ సంఖ్య చీటీలు అందించి పోలింగ్ జరిపించాల్సి ఉంటుందన్నారు. ఈ అంశాలన్నింటినీ మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతుల్లో సూచించిన అంశాలను చక్కగా అవగాహన చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.





అగ్ర నేతల పర్యటనలపై భారీ ఆశలు!

» 10న తాండూరులో జన జాతరకు ప్రియాంకాగాంధీ
» 11న వికారాబాద్‌లో అమిత్ షా బహిరంగ సభ
» భారీ జన సమీకరణే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ఏర్పాట్లు

వికారాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటనలపై భారీ ఆశలు పెట్టుకున్నాయి. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ఎవరికి వారు దూకుడు పెంచారు. మినీ ఇండియాగా భావించే చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో గెలుపును కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఎక్కువ సంఖ్యలో ఓటర్లను ప్రభావితం చేసేలా ఆయా పార్టీల అభ్యర్థులు వ్యూహాత్మకంగా ప్రచారాన్ని సాగిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో నిర్వహించే బహిరంగ సభలు అభ్యర్థుల ఫలితాలను నిర్దేశిస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నెల 10న సాయంత్రం 4గంటలకు తాండూరులో ప్రియాంకాగాంధీ జనజాతర సభకు హాజరయ్యేలా పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రియాంక బహిరంగ సభను విజయవంతం చేసేందుకు చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి కొంపల్లి యాదవరెడ్డి, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు ఈ నెల 11న కేంద్ర హోం శాఖ మంత్రి వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభకు హాజరై ప్రసంగించనున్నారు. అమిత్ షా పర్యటనను బీజేపీ అతి కీలకంగా తీసుకుంటోంది. తటస్థ ఓటర్లు అమిత్ షా పర్యటనతో బీజేపీ వైపు మొగ్గు చూపుతారని ఆ నేతలు భావిస్తోంది. అమిత్ షా వికారాబాద్ పర్యటన మొదట 9న ఖరారైంది. అయితే రద్దవుతుందని భావించిన ప్రియాంకాగాంధీ పర్యటన ఈ నెల 10న ఉండడంతో బీజేపీ తన సభను 11వ తేదీకి వాయిదా వేసింది. మొదట ఈ నెల 4న వికారాబాద్‌కు మోదీ వస్తారని ఆ పార్టీ నాయకులు భావించినా ఉత్తరాదిన బిజీ షెడ్యూల్ కారణంగా ఆయన పర్యటన రద్దయింది. ఈ నేపథ్యంలోనే అమిత్ షాతోనైనా బహిరంగ సభ నిర్వహించాలని పట్టుదలతో ప్రయత్నించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అమిత్ షా, మోదీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీల బహిరంగ సభలు ఎప్పుడు జరిగినా హైదరాబాద్ నగర శివార్లలోనే నిర్వహిస్తూ వచ్చారు. గ్రామీణ ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలో ఈ సారి పార్టీ అగ్రనేతల బహిరంగ సభలు నిర్వహించాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పట్టుదలతో ప్రయత్నించడంతో జిల్లాలో జరిగే సభలకు హాజరవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ఓటర్లే టార్గెట్‌గా వికారాబాద్‌లో బహిరంగ సభలకు పార్టీలు మొగ్గు చూపుతున్నాయి.

భారీ జన సమీకరణ, బల నిరూపణే లక్ష్యం!

ఇదిలా ఉంటే, ప్రియాంకగాంధీ, అమిత్‌షాలు పాల్గొనే బహిరంగ సభలకు వేలాదిగా జనాన్ని సమీకరించి ప్రజల్లో పార్టీకి ఎంత ఆదరణ ఉందో చూపాలని ప్రతిష్ఠాత్మకంగా సభలను నిర్వహించనున్నాయి. ఎన్నికల అంకం కీలక దశకు చేరడంతో పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు నిర్వహించే బహిరంగ సభలకు వేలాదిగా జనం వస్తే పార్టీకి బూస్టప్‌గా పనికొస్తుందని నేతలు భావిస్తున్నారు. తాండూరులో నిర్వహించే ప్రియాంకగాంధీ సభకు లక్ష జన సమీకరణ చేయాలనే లక్ష్యాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్దేశించుకుంది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఈ సభకు ప్రజలను తరలించేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో జన సమీకరణ చేసేలా ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు ఇక్కడ ఉండడంతో కాంగ్రెస్‌కు జన సమీకరణ, సభ ఏర్పాట్ల పనులు త్వరత్వరగా పూర్తవుతున్నాయి. పార్టీ శ్రేణలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని వనరులనూ నేతలు వినియోగించుకుంటూ సభను సక్సెస్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా వికారాబాద్‌లో నిర్వహించే అమిత్ షా బహిరంగ సభకు కూడా వేలాదిగా కార్యకర్తలు, ప్రజలను తరలించాలని బీజేపీ భావిస్తోంది. వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల నుంచి లక్ష వరకు జన సమీకరణ చేయాలనే లక్ష్యం పెట్టుకోవాలని అధిష్ఠానం నిర్దేశించినట్లు తెలుస్తోంది. ప్రియాంకా గాంధీ, అమిత్ షాల బహిరంగ సభలకు సంబంధించి జన సమీకరణతో పాటు సభల ఏర్పాట్లలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు తలమునకలై ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీల్లో కొత్త ఊపు


జిల్లాలో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు కాంగ్రెస్, బీజేపీల ఇద్దరు అగ్రనేతలు జిల్లాకు రావడం ఆ పార్టీల్లో కొత్త ఊపు తెస్తోంది. ప్రియాంక గాంధీ బహిరంగ సభపై కాంగ్రెస్ శ్రేణులు గంపెడాశలు పెట్టుకున్నాయి. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటనపై బీజేపీ భారీ ఆశలు పెంచుకుంది. అగ్ర నేతల ప్రచారం తమకే లాభిస్తుందని కాంగ్రెస్ భావిస్తుండగా, తమకే కలిసి వస్తుందని బీజేపీ ఆశిస్తోంది.

బీఆర్ఎస్ రాష్ట్ర నేతల పర్యటనలు లేనట్లేనా?

ఇదిలా ఉంటే, లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ అగ్రనేతల పర్యటనలు ఇంకా ఖరారు కాలేదు. వికారాబాద్, పరిగి నియోజకవర్గాల్లో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సన్నాహక సమావేశాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత గులాబీ దళపతి కేసీఆర్, లేదా కేటీఆర్, హరీష్ రావుల్లో ఎవరైనా ఒకరు జిల్లాలో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారని ఆ పార్టీ శ్రేణులు భావించాయి. అయితే ఇంత వరకు బీఆర్ఎస్ అగ్రనేతల జిల్లా పర్యటన ఖరారు కాలేదు. ఎన్నికల ప్రచారం ముగిసే వరకు కేసీఆర్ బస్సుయాత్ర షెడ్యూల్ ముందుగానే ఖరారు కావడంతో ఆయన పర్యటన జిల్లాలో లేదు. ఎన్నికల ప్రచార గడువు ముగిసే వరకు కేటీఆర్, హరీష్‌రావుల్లో ఎవరైనా జిల్లాలో పర్యటించి ఎన్నికల ప్రచారం చేస్తారా? లేక మాజీ మంత్రి, చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి సబితారెడ్డి, అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కె.మహేష్‌రెడ్డి, రోహిత్‌రెడ్డిలే అన్నీ తామై ప్రచారాన్ని నిర్వహించి ముగిస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది. కాగా ఈ నెల 11 సాయంత్రంతో ప్రచార గడువు ముగియనుంది.











నా పనితీరు నచ్చితేనే

ఓటెయ్యండి



(ఐదో పేజీ తరువాయి)

పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేశాను. ప్రజలు కూడా ఇది గుర్తించారు. అందుకే ప్రచారానికి ఎక్కడకు వెళ్లినా నన్ను ఆదరిస్తున్నారు. సొంతింటి మనిషిలా చూస్తున్నారు. అయిదేళ్లలో ప్రతి మున్సిపాలిటీలో రోడ్లు, స్టేడియం, ఆసుపత్రుల నిర్మాణాలకు నిధులు తెచ్చాను. 111జీవో ఎత్తివేయడంలో నా కృషి కూడా ఎంతో ఉంది. కొవిడ్ సమయంలో అసెంబ్లీ నియోజకవర్గానికో అంబులెన్స్ ఇచ్చాను. ఆరోగ్య బస్ ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందించాను. నా వద్దకు ఏదైనా సమస్యతో వచ్చిన వారిని కలిసి వారి సమస్యలను పరిష్కరించాను. ఎవరినైనా అడగండి.. సమస్య ఏదైనా నా చేతనంతా సాయం చేసి వారి సమస్యలను పరిష్కరించే యత్నం చేశాను. అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు ఆదరిస్తున్నారు. ఇంతకంటే రాజకీయ నాయకునికి ఏమి కావాలి? ప్రజల ఆదరణ చూస్తే తప్పక మళ్లీ గెలుస్తాననే ధీమా వస్తోంది.

నచ్చితేనే ఆదరించండి..

అయిదేళ్ల పాటు నా పనితీరు నియోజకవర్గ ప్రజలు చూశారు. అయిదేళ్ల కాలంలో నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి నచ్చితేనే ఆదరించి ఓటెయ్యండి అని ప్రజలను కోరుతున్నాను. నా పనితీరు నచ్చకుంటే ప్రశ్నించండి.. సమాధానమిస్తాను. నియోజకవర్గాన్ని తాము ఉద్ధరిస్తామంటూ ఇపుడు కొందరు వచ్చి వంగి వంగి దండాలు పెడుతున్నారు. మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తున్నారు. ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారు. ఈ విషయంపై ఆలోచించి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటెయ్యాలి. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉంది. పార్లమెంట్‌లో కూడా కాంగ్రెస్ గెలిస్తేనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుంది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలకు కూడా ప్రజల్లో మంచి స్పందన ఉంది.

అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి...

చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరాను. అధికారంలో ఉన్న పార్టీలో ఉంటేనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం. గత అయిదేళ్లలో ఎంపీగా నా పనితీరు సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తెలుసు. మేమిద్దదరం ఉమ్మడి జిల్లాలో ఎంపీలుగా ఉన్నాం. ఇక్కడ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉంది. ఆయన ఆశీస్సులతో పార్లమెంట్‌లో అనేక అభివృద్ధి పనులు చేస్తాను.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

పట్టణ, గ్రామీణ ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం. తాండూరులో పరిశ్రమలను దూరంగా తరలించి కాలుష్యం బారి నుంచి తాండూరు వాసులను కాపాడతాం. వికారాబాద్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తాను. ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి వద్ద మంచి రూట్‌మ్యాప్ ఉంది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీరు తీసుకు వస్తాం. అలాగే మూసి ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మెట్రోరైలు ప్రాజెక్టును శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు విస్తరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో దీన్ని కందుకూరు వరకు పొడిగించే యత్నం చేస్తున్నాం.

బీఆర్‌ఎస్ నేతల బాహాబాహీ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మనస్పర్థలు

ఆమనగల్లు, మే 6 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతల మధ్య ఏర్పడ్డ మనస్పర్థలు బాహాబాహీకి దారి తీశాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఆ పార్టీ నేతల సమక్షంలోనే ఇద్దరు మండల నాయకులు అసభ్య పదజాలంతో దూషించుకున్నారు. ఒక దశలో ఇరువురు నేతలు ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఆమనగల్లు మండల పరిధిలోని పోలెపల్లి, సింగంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచార బాధ్యతలను బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావుకు అప్పగించారు. అదే గ్రామానికి చెందిన ఎంటీపీసీల ఫోరం మండలాధ్యక్షుడు దోనాదుల కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పటికే ఇద్దరి మధ్య ఉన్న విభేదాలు కూడా తోడై అర్జున్‌రావు, కుమార్‌లు ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. సోమవారం పట్టణంలో బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయం వద్ద మొదలైన వివాదం.. మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలనకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఆనంద్‌ల ఎదుట మరోసారి ఇరువురు నేతలు గొడవపడ్డారు. గొడవ పెద్దది అయి అసభ్య పదజాలతో దూషించుకుంటూ కుమార్, అర్జున్‌రావులు ఒకరిపై ఒకరు చేయి చేసుకోబోగా అక్కడే ఉన్న పార్టీ నేతలు అడ్డుకున్నారు. అనంతరం ఇరువురు నేతలను జైపాల్ యాదవ్ తన వాహనంలో ఎక్కించుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న మనస్పర్థలే వివాదానికి కారణమని సమచారం.

మద్దతు ధర కల్పనలో ప్రభుత్వం విఫలం

ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి సందర్శించారు. ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ అనురాధాపత్యానాయక్, తదితరులున్నారు.

చికెన్ ధరకు రెక్కలు



మేడ్చల్ మే 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భానుడి ప్రతాపంతో కోళ్ల సరఫరా తగ్గింది. దీంతో జిల్లాలో మాంసం ధరలు అమాంతం పెరిగాయి. ప్రస్తుతం బాయిలర్ చికెన్ కిలో రూ.280, స్కిన్‌లెస్ చికెన్ రూ.300లకు చేరుకుంది. సాధారణ రోజుల్లోనే చికెన్ దుకాణాల వద్ద వరుసకట్టే మాంసాహార ప్రియులు ధరల పెరుగుదల కారణంగా వారంతంలోనూ పెద్దగా ఆసక్తిచూపడంలేదు. కొనలేమని వినియోగదారులు, అమ్మకాలు తగ్గాయని దుకాణాదారులు వాపోతున్నారు. వేసవిలో పెంపకం చేపట్టకపోవడం, అధిక వేడి కారణంగా కోడి బరువు పెరుగుదలలో వ్యత్యాసం ఉంటోంది. ప్రస్తుతం వీస్తున్న వడగాడ్పులకు కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఇవన్నీ ధరల పెరుగుదలకు కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. మేడ్చల్ చుట్టు పక్కల పెంచిన కోళ్లకు తోడు నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల నుంచి కోళ్లు సరఫరా అవుతున్నాయి. వేసవి కారణంగా ఇతర ప్రాంతాల నుంచి సరఫరా నిలిచిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. బ్రాయిలర్ కోడి ధర పెరుగుదల ప్రభావం నాటుకోడి పైనా కనిపిస్తోంది. గత వారం కిలో రూ.500 ఉన్న నాటు కోడి ధర ఈవారం రూ.600లకు ఎగబాకింది.

పోస్టల్ బ్యాలెట్లలో పేర్లు గల్లంతు!

● వికారాబాద్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఉద్యోగుల ఆందోళన



పోస్టల్ బ్యాలెట్ జాబితాల్లో తమ పేర్లు వెతుక్కుంటున్న ఉద్యోగులు

వికారాబాద్, మే 6: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే వివిధ శాఖల ఉద్యోగులు, పోలీసు సిబ్బంది ముందుగానే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఎన్నికల విధుల్లోని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గ కేంద్రాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఆరు వేల మందికి పైగా ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసులు ఉండగా ఇతర జిల్లాల నుంచి మరో 3వేల మందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. మొత్తం మీద జిల్లాలోని ఫోసిలియేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 9వేల మందికిపైగా ఉద్యోగులు, పోలీసులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. అయితే ఎన్నికల శిక్షణ పొందే సమయంలోనే పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగులు, పోలీసుల నుంచి ఫారం-12తో పాటు ఎన్నికల విధుల ఉత్తర్వులు తీసుకున్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనుంది. అయితే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమై నాలుగు రోజులు గడుస్తున్నా ఓటు హక్కు వినియోగం మందకొడిగానే కొనసాగుతోంది. మూడు రోజులు మాత్రమే గడువుంది.

ఓటు వినియోగించుకునే అవకాశమివ్వండి

ఇదిలా ఉంటే, వికారాబాద్ ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు వచ్చిన పలువురు ఉద్యోగులు జాబితాల్లో తమ వివరాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ కేంద్రంలో 270మంది వరకు ఉద్యోగుల వివరాలు పోస్టల్ బ్యాలెట్ ఓటరు జాబితాలో లేవని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల విధులు నిర్వహించే తమ ఓటు హక్కును కూడా సక్రమంగా వినియోగించుకోలేని విధంగా జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని వారు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్‌లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలంటూ తమ ఫోన్లకు మెసేజ్‌లు రావడంతో ఇక్కడకు వచ్చిన ఉద్యోగుల్లో కొందరు జాబితాల్లో తమ వివరాల్లేక ఓటు వేయలేకపోయారు. వికారాబాద్ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకున్న స్థానిక ఉద్యోగులకూ ఈ విషయంలో భంగపాటే ఎదురైంది. కొందరు ఉద్యోగుల ఎపిక్ కార్డు వివరాలు తప్పుల తడకగా నమోదు చేయడంతో వారి ఫారాలు తిరస్కరణకు గురయ్యాయి. ఎన్నికల విధులు నిర్వహించేందుకు వెళ్లనున్న తాము తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా జిల్లా ఎన్నికల అధికారి, ఏఆర్‌వోలు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఉద్యోగులు ఏఆర్‌వో దృష్టికి తీసుకు వెళ్లగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు.



బధిరులు, అంధులు ఓటు వినియోగించుకోవాలి

వికారాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): బధిరులు, అంధులు ఓటు హక్కు వినియోగించుకునేలా సదుపాయాలు కల్పించినట్లు జిల్లా సంక్షేమాధికారి జ్యోతిపద్మ తెలపారు. ఓటు హక్కు వినియోగంపై తన ఛాంబర్‌లో స్వీప్ నోడల్ అధికారి ఎంఏ సత్తార్‌తో కలిసి బధిరులు, అంధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో దివ్యాంగులు అందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వారికి వీల్‌ఛైర్‌లు, ర్యాంప్‌ల నిర్మాణం వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. అంధులు బ్రెయిలీ లిపి బ్యాలెట్ పేపర్‌తో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగ ఓటర్లకు ప్రభుత్వం ఉచిత రవాణా సౌకర్యంతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద వీరికి సహాయకులుగా వలంటీర్లను నియమించామని కోరారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు శ్యాంప్రసాద్, జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి జ్యోతిపద్మ

ఓటర్ల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నంబర్

మేడ్చల్ మే 6(ఆంధ్రజ్యోతి):లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, ఓటర్ల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నంబర్ కలెక్టరేట్లో 24గంటలు పని చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల ఏమైనా ఫిర్యాదులు చేయాల నుకుంటే 18004252050 అనే నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. డబ్బు తరలింపు, ఇతర ప్రలోభాలకు గురిచేయడాన్ని గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

పోలీసుల తనిఖీల్లో రూ.లక్షా 60వేలు స్వాధీనం

ఆదిభట్ల, మే 6 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా చేపడుతున్న వాహన తనిఖీల్లో ఆదిభట్ల పోలీసులు సోమవారం లక్షా అరవై వేలు స్వాధీనం చేసుకున్నారు. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాగన్నగూడ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా.. అశోక్ లేలాండ్ వాహనం(టీఎస్ 07 యూఈ 2411)లో రూ.1,60,360 నగదు పట్టుబడినట్లు ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా నగదు తరలిస్తున్న బాలాపూర్‌కు చెందిన ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని పంచనామా నిర్వహించిన అనంతరం నగదును ఎన్నికల అధికారి ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు అందజేసినట్లు పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలి

▸ శంషాబాద్ రోడ్ షోలో మాజీ మంత్రి కేటీఆర్

శంషాబాద్/శంషాబాద్ రూరల్, మే 6 : చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతున్నారని, మరి తాము యాదాద్రి ఆలయాన్ని నిర్మించాం.. దేవుళ్ల పేరుతో ఓట్లు అడిగామా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి శంషాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి కేటీఆర్ ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నుంచి బీసీ వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలి

షాబాద్ : కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ, షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి సతీమణి పట్నం సాన్విరెడ్డి అన్నారు. షాబాద్ మండలం చందన్‌వెల్లి, కుమ్మరిగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, కేతన, నాయకులు రాంబాబుయాదవ్, రమేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

చేవెళ్ల ఎంపీ స్థానం బీఆర్ఎస్‌దే

చేవెళ్ల/మహేశ్వరం/ : చేవెళ్ల ఎంపీ స్థానం ముచ్చటగా మూడోసారి కూడా బీఆర్ఎస్‌దేనని ఆ పార్టీ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు ఎన్.రామాగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి రెండుసార్లు చేవెళ్ల ఎంపీ స్థానం కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఈసారి కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజారిటీతో గెలిచి చరిత్ర సృష్టిస్తారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో చేవెళ్ల ఎంపీ స్థానం హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని హామీలను ఇచ్చిందని ఆరోపించారు. కాసానిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సోమవారం తుక్కుగూడ, రావిరాల గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీనియర్ నాయకులు సురేష్ మాట్లాడుతూ జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలన్నారు. శ్రీనివాస్, సప్పిడి రాజు, యాదగిరి తదితరులున్నారు.


శంషాబాద్ రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన కాసాని జ్ఞానేశ్వర్

కాసాని గెలుపు తథ్యం

కందుకూరు : చేవెళ్ల నుంచి కాసాని గెలుపు తథ్యమని ఏఎంసీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్‌లు అన్నారు. కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని సరస్వతిగూడ, అగర్‌మియాగూడ, లేమూరు తదితర గ్రామాల్లో నియోజకవర్గ నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎలుక మేఘనాథ్‌రెడ్డిలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కాకి దశరథ, టి.ఇందిరదేవేందర్, సురేష్, పొట్టి ఆనంద్, బర్కం వెంకటేష్, సామ ప్రకాశ్‌రెడ్డి, తదితరులున్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

చేవెళ్ల : బీఆర్ఎస్‌ను గెలిపించాలని డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రభాకర్ చేవెళ్ల మండలం తల్లారం, దుద్దగు, న్యాలటలో ప్రచారం చేశారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్లు నర్సింలు, బి.నర్సింలు, యూత్ మండలాధ్యక్షుడు తోట చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు తదితరులున్నారు.

బీసీ బిడ్డను ఎంపీగా గెలిపించాలి

పరిగి/వికారాబాద్/దోమ/తాండూరు రూరల్, మే 6: బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి కోరారు. పరిగి మున్సిపల్ పరిధిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ బీసీలకు పెద్దపీట వేస్తుందన్నారు. నాలుగు నెలల వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కాసానిని గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ అశోక్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, సంతోష్, జి.అశోక్ పాల్గొన్నారు. వికారాబాద్‌లో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్(బీఆర్‌టీయూ) ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కృష్ణయ్య ఆటో యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. కాసానికి ఓటేసి గెలిపించాలని కోరారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, మక్బూల్, మాణిక్యం, వెంకటయ్య పాల్గొన్నారు. దోమ మండలం బొంపల్లిలో ఎంపీటీసీ రాములు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు సంగయ్యయాదవ్, వెంకటయ్య పాల్గొన్నారు. తాండూరులోని పలు గ్రామాల్లో నేడు(మంగళవారం) మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి స్ట్రీట్ కార్నర్‌మీటింగ్స్ నిర్వహిస్తున్నట్లు మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

కరోనాలో కాపాడిన బిడ్డగా ఓట్లు అడుగుతున్నా

మేడ్చల్ టౌన్/నేరేడ్‌మెట్, మే 6(ఆంధ్రజ్యోతి): కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజల బిడ్డగా నిరుపేదల ప్రాణాలు కాపాడి సేవచేసిన తనను లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాలని మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోరారు. సోమవారం రాత్రి మేడ్చల్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. నిత్యం ప్రజాసేవలో ఉన్న తనను ప్రజలు ఆశీర్వదించాలన్నారు. గతంలో ఆరోగ్య శాఖ మంత్రిగా కరోనాలో ఎందరో నిరుపేదలకు వైద్యసేవలందేలా కృషిచేశానని చెప్పారు. తనను స్థానికేతరుడని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడ్చల్ ప్రజలకు స్థానికుడా? అని ప్రశ్నించారు. తాను ఏళ్లుగా నియోజకవర్గంలో నివాసాన్ని ఏర్పర్చుకొని ప్రజల మధ్యే ఉంటున్నారని తేల్చి చెప్పారు. నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో కోట్లాది నిరుపేదల జీవితాలు చక్కబడ్డాయని తెలిపారు. బూటక మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వాగ్దానాలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నారెడ్డి నందారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రేమ్‌దాస్, ఎం.రాజు, శ్రీనివాస్‌గౌడ్, శైలజ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్ మణి ఎన్‌క్లేవ్‌లో జరిగిన సమావేశంలో ఈటల మాట్లాడారు. మోదీ హయాంలోనే దేశ రూపురేఖలు మారుతున్నాయన్నారు. దేశంలో 76 విమానాశ్రయాలకు ఇప్పుడు 153 అయ్యాయని, రైల్వేస్టేషన్లను ఎయిర్‌పోర్టులవలె తీర్చి దిద్దుతున్నారన్నారు. 500ఏళ్లు నుంచి ఎదురు చూస్తున్న రామ మందిరాన్ని నిర్మింపజేసి గొప్ప వ్యక్తి మోదీ అన్నారు. సుస్థిరత, సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎన్నో కార్యక్రమాలను చేపట్టొచ్చని చెప్పారు. మల్కాజిగిరి అభివృద్ధికి పాటుపడతానని, ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. నేరేడ్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణబాబు, నాయకులు రవిందర్‌రెడ్డి, ప్రసన్న, రాజు, సైనికుల కుటుంబాలు పాల్గొన్నాయి.


రోడ్ షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఈటలకు మద్దతుగా కోడలు క్షమిత ప్రచారం

మల్కాజిగిరి/మల్లాపూర్/రామంతాపూర్/వనస్థలిపురం/చంపాపేట:మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఆయన కోడలు క్షమిత ప్రచారం నిర్వహించారు. పాత మల్కాజిగిరిలోని మహాకాళి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఓల్డ్ మల్కాజిగిరిలో ఇంటింటికి వెళ్లి బీజేపీకి ఓటు వేసి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రతినిధి సునీల్‌యాదవ్, కార్పొరేటర్ శ్రవణ్, రాంబాబు, బాలలింగం, మహేష్, సోమశ్రీనివాస్, బక్క నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు. బీజేపీ ఇన్‌చార్జి ప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో మౌలాలి మెహిదీ జంగ్ కాలనీలో స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు.ప్రవచనకర్త సూర్యనారాయణమూర్తి హాజరై ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, దేశాన్ని ముందుకు తీసుకువెళ్తున్న ప్రధాని మోదీని మరోమారు గెలిపించుకోవాలన్నారు. మౌలాలి కార్పొరేటర్ సునీత, ఆర్ఎస్ఎస్ వాసుదేవరావు, సాయిబాబా, లింగారావు, చంద్రశేఖర్, భాను, బబిత, లలిత పాల్గొన్నారు. ఈటల రాజేందర్‌ను గెలిపిస్తే పేదల కష్టాలు తొలగిస్తారని రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్‌లో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. మోదీ నేతృత్వంలో ఈటల గెలిస్తే మల్కాజ్‌గిరి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను తెచ్చారన్నారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మహిళా మోర్చా సబిత, మాధవి, సుజాత, నిర్మల, నరేందర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. రామంతాపూర్ డివిజన్ నేతాజీనగర్, అరవింద్‌నగర్, గాంధీనగర్, శ్రీరామ కాలనీలలో కార్పొరేటర్ బండారు శ్రీవాణీవెంకట్‌రావు ఈటల రాజేందర్‌కు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో బీజేపీ నాయకులు తిరపతయ్య అశోక్‌రాజ్, శైలేందర్, వీణ పాల్గొన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం అభివృద్ధికి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కె.నర్సింహారెడ్డి అన్నారు. జడ్జెస్‌కాలనీ, ఫేజ్-1, సహారాస్టేట్స్, శ్రీరామహిల్స్ కాలనీల్లో బీజేపీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల నాయకులు శ్రీకాంత్, చంద్రారెడ్డి, అంజయ్యగౌడ్, రామచంద్రారెడ్డి, రామేశ్వర్, శ్రీధర్‌గౌడ్, రాజశేఖర్ పాల్గొన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్‌లో కార్పొరేటర్ వి.మధుసూదన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓట్లేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. నాయకులు రమేష్‌గౌడ్, దశరథ్‌గౌడ్, గణేష్, మల్లేష్, ఓంప్రకాష్, గిరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి

▸ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, మే 6: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మొద్దని, ఆ పార్టీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్, మంతట్టి, కంసాన్‌పల్లి, పర్వత్‌పల్లి, మర్పల్లి, నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిల్‌పూర్, ఇందర్‌చెడ్, నవాంద్గీ, గంగ్వార్, క్యాద్గీరా, జీవన్గి గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, అధికారం కోల్పోయిన బీఆర్ఎస్.. బీజేపీతో కుమ్మక్కై, నాయకులు ఓట్ల కోసం తిరుగుతున్నారని విమర్శించారు. అంతకుముందు నీళ్లపల్లిలో ఎమ్మెల్యే, ఆర్‌టీఐ మాజీ కమిషనర్ లక్ష్మణ్‌నాయక్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తండాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. తాండూరు నియోజక వర్గంలో సుమారు 130 తండాలు ఉన్నాయని, గిరిజనులు కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నవాంద్గీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఎమ్మెల్యే సోదరుడు సత్యనారాయణరెడ్డి, తదితరులున్నారు.


బషీరాబాద్ : ప్రచారంలో మట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం

నవాబుపేట/చేవెళ్ల : చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ అన్నారు. నవాబుపేట మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సి.సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులున్నారు. ఐదేళ్లకోసారి రాజకీయ పార్టీలు ఇచ్చే ప్యాకేజీలకు అమ్ముడుపోయే చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం చరిత్ర చేవెళ్ల ప్రజలందరికీ తెలుసునని భీంభరత్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రంజిత్‌రెడ్డిపై అవాస్తవాలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని, ఎన్నికల్లో ఎమ్మెల్యే యాదయ్య బీజేపీకి అమ్ముడుపోయాడని, దమ్ముంటే కాసానిని గెలిపించుకోవాలని సవాల్ విసిరారు.

కాంగ్రెస్‌కు సీపీఐ మద్దతు : విజయలక్ష్మీ పండిట్

తాండూరు/బంట్వారం (కోట్‌పల్లి)/దోమ మే 6: ఇండియా కూటమిలో భాగంగా సీపీఐ రంజిత్‌రెడ్డికి పూర్తి మద్దతు ఇస్తుందని జిల్లా కార్యదర్శి , మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మీ పండిట్ తెలిపారు. తాండూరులో సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ సీపీఐ పొత్తు ఉండి మద్దతు తెలిపినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మునీర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్లు లుక్‌మాల్ హుస్సేనీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రవీందర్, మహిళ సమాఖ్య నాయకురాలు నస్మాబేగం, తదితరులున్నారు. కాగా, ప్రచారంలో భాగంగా కౌన్సిలర్ విజయదేవి, మాజీ కౌన్సిలర్ సర్దార్‌ఖాన్ రంజిత్‌రెడ్డి తరఫున ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేస్తామని బంట్వారం మండలాధ్యక్షుడు వెంకటేశం అన్నారు. వికారాబాద్‌లో ఆయన సమక్షంలో యాచారం మాజీ సర్పంచ్ బల్వంత్ రెడ్డి అనుచరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిశారు. బొంపల్లిలో రిటైర్డ్ ఏఎస్ఐ అంతిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్ ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం

ధారూరు : చేవెళ్ల నుంచి కాంగ్రెస్‌ను గెలిపించుకుని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని పీసీసీ ప్రధాన కార్యదర్శి పి. రఘువీరారెడ్డి తెలిపారు. ధారూరు పరిధిలోని తరిగోపుల, మున్నూర్‌సోమారంలో స్పీకర్ తనయ అనన్య చేతన్, రంజిత్ రెడ్డి తనయుడు సిద్ధార్థరెడ్డిలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మండలాధ్యక్షుడు విజయబాస్కర్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు. ధారూరు మండం నాగారంనకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాజేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. వికారాబాద్ పట్టణంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

కులకచర్ల : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. కులకచర్ల మండలంలోని చాపలగూడెంలో ప్రచారం చేశారు. పరిగి బ్లాక్‌బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు వెంకటయ్యగౌడ్, కుమ్మరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలి

కందుకూరు/చేవెళ్ల : లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ఓటర్లకు క్లుప్తంగా వివరించాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. కందుకూరు మండలంలోని బైరాగూడలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులు చాడ లోకేందర్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్, అనేగౌని పాండుగౌడ్, పొట్ట కుమార్, బాలమల్లేష్‌యాదవ్, సుధాకర్, పి.ప్రేమలమ్మ, వినోద, రవీందర్, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు. చేవెళ్ల ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎంపీగా రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ సున్నపు వసంతం, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎన్కెపల్లి ఎంపీటీసీ వనం మాధవి లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. చేవెళ్ల మండలం గొల్లగూడ, కేసారంలో ప్రచారం చేశారు.


చేవెళ్ల : గొల్లగూడలో ప్రచారం చేస్తున్న నాయకులు

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

▸ కలెక్టర్ నారాయణరెడ్డి ▸ ఈవీఎం కమిషనింగ్ పరిశీలన

కొడంగల్, మే 6: ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులుండేలా చూడాలని వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కమిషనింగ్ ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ సెంటర్‌లో చేపట్టిన కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లలో పేపర్ల అమరిక, అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తుల అమరిక పనులను పరిశీలించారు. ఎలాంటి సాంకేతిక లోపం లేకుండా ఈవీఎంలను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా కమిషనింగ్ పూర్తిచేయాలని ఏఆర్వోలకు సూచించారు. అనంతరం ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి ఓపీవోలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి విధులపై సూచనలు చేశారు. పోలింగ్ రోజు ఉదయం 5:30గంటలకు మాక్ పోలింగ్ నిర్వహణతో పోలింగ్ ప్రక్రియను ప్రారంభించడం, 17సీపీవో డైరీ రాయడం వంటి వాటిపై సూచనలు చేశారు. అనంరతం 243, 244 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్, దానయ్య, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిణి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


ఈవీఎం కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి


తాండూరు భద్రేశ్వర జాతరలో లంకాదహనం కార్యక్రమం

నయనానందకరం.. లంకాదహనం!

▸ ముగిసిన భద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవ ప్రధాన ఘట్టాలు

తాండూరు, మే 6: తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారు జామున లంకాదహన కార్యక్రమం నయనమనోహరంగా నిర్వహించారు. కండ్లు మిరుమిట్లు గొలిపేలా బాణసంచా, పుష్పాలంకరణలతో లంకాదహనాన్ని చేపట్టారు. ఆలయ గర్భగుడి నుంచి స్వామి విగ్రహాన్ని పల్లకి సేవలో గాంధీచౌక్, జామామసీదు మీదుగా బసవణ్ణకట్టకు చేరుకొని లంకాదహనానంతరం భద్రేశ్వరస్వామి గుడికి చేరుకున్నారు. ఉత్సవాల్లో భజనలు, పురుతయ్యల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. స్వామికి అర్ధరాత్రి వరకు మహిళలు నైవేద్యాలు సమర్పిస్తూ మొక్కు తీర్చుకున్నారు. బసవణ్ణకట్ట సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో బాణసంచా వినియోగించి నిర్వహించిన లంకాదహన కార్యక్రమం ఆకట్టుకుంది. విరజిమ్మిన వెలుగులను తిలకించి ప్రజలు పరవశించారు. కొడంగల్, కోస్గి, మద్దూర్, నారాయణపేట్, వికారాబాద్, తాండూరు, పరిగి, వికారాబాద్, కర్నాటక రాష్ట్రం చించోళి, గుర్మిట్కల్, కుంచారం ప్రాంతాల భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జాతరలో ప్రధాన ఘట్టాలైన రథోత్సవం, లంకాదహనాలు ముగిశాయి. ఆలయ ఈవో శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో వీరశైవ సమాజం, యువదళ, హనుమాన్ భజన మండలి భక్తులకు సేవలందించారు. ఆలయ ప్రాంగణంలో కొలువైన లింగేశ్వరుడికి, ఆంజనేయస్వామి వార్లకు పూజలు చేశారు.

ఆటో డ్రైవర్లను ఆదుకుంటాం

శంషాబాద్/చేవెళ్ల/మహేశ్వరం/షాబాద్, మే 6: చేవెళ్లలో తాను ఎంపీగా గెలవగానే ఆటో డ్రైవర్లను ఆదుకుంటానని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ వైఎన్ఆర్ గార్డెన్‌లో సోమవారం భారతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆటోడ్రైవర్లు లైట్‌వెట్ మోటార్ వెహికల్ డ్రైవర్లతో కొండా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసిందని ఆరోపించారు. ప్రతీనెల జీవన భృతి కల్పిస్తామని చెప్పి మాటతప్పారని అన్నారు. తాను ఎన్నికల్లో గెలిచాక ఆటో డ్రైవర్లకు బ్యాంకు రుణాలతో పాటు ఆవాస్ యోజన పథకం కింద సొంతింటి కల సాకారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భారతీయ మజ్దూర్ యూనియన్ ముఖ్య నాయకులు సభ్యులు , బీజేపీ నాయులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో ఎంపీపీ విజయలక్ష్మీ, పార్టీ మండల అధ్యక్షుడు దేవర పాండు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులుగౌడ్, అదెట్ల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి ఉన్నారు. అదేవిధంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి మహేశ్వరం మండలంలోని అమీర్‌పేట, మాణిక్యమ్మగూడ, కేకేబస్తీ, సుభాన్‌పూర్ గ్రామాల్లో మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి మిద్దెసుదర్శన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధోజు మాదవాచారి, మాజీసర్పంచ్ శ్రీశైలం పాల్గొన్నారు. అదేవిధంగా తుక్కుగూడలో కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు కాటం భాస్కర్‌గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. షాబాద్‌లో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ సోమవారం మండల కేంద్రంలో మండల స్థాయి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయవాద పార్టీని అధికారంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు చంద్రబాబు పాల్గొన్నారు.


మహేశ్వరం అమీర్‌పేట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి


మాట్లాడుతున్న బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి

ఆరవై ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమి లేదు: కేఎస్ రత్నం

నవాబుపేట/బంట్వారం/యాలాల/తాండూరు రూరల్/ధారూరు, మే 6: ఆరవై ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. నవాబుపేట మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం బీజేపీ పాలన కొనసాగిస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సోమన్న, రామకృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో సోమవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బీజేపీకి విశేష ప్రజాదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేహెచ్ రత్నం, పార్టీ మండల ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, జగన్ పాల్గొన్నారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు ఆధ్వర్యంలో బంట్వారం మండలం మద్వాపూర్ మాజీ సర్పంచ్ గోవింద్‌రెడ్డి, యాచారం గ్రామానికి చెందిన ఎంపీటీసీ భర్త బీఆర్ఎస్ నాయకులు శరణరెడ్డి, నర్సింహులు బీజేపీలో చేరారు. అదేవిధంగా కోట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో వడ్ల నందు ప్రచారం నిర్వహించారు. యాలాలలోని లక్ష్మీనారాయణపూర్, బెన్నూర్, హాజీపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్, ఎమ్మార్పీఎస్ యాలాల మండల శాఖ అధ్యక్షుడు మెట్ల సూర్యప్రకాష్‌లు బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ అజయ్ ప్రసాద్, శ్రావణ్ పాల్గొన్నారు. అదేవిధంగా చింతామణిపట్నం, పర్వతాపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జినుగుర్తి నర్సింహులు మాదిగ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా ధారూరు మండలంలోని నాగారం గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు ఎం. రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండుగౌడ్, నరేందర్‌రెడ్డి, రాజేందర్ గౌడ్, కృష్ణ, సాయిగౌడ్, నవభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

తలకొండపల్లి, మే 6 : కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని చుక్కాపూర్, ఖానాపూర్, గట్టిప్పలపల్లి, వెల్జాలలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయా చోట్ల రోడ్‌షోలు నిర్వహించారు. ఎమ్మెల్యే, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి ఇందిరాశోభన్, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ మల్లు రవి తనయుడు సిద్ధార్థలు హాజరై మల్లు రవి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు మోహన్ రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, రవీందర్ యాదవ్, తదిరతులున్నారు.

ఆశీర్వదించి గెలిపించండి : క్యామ మల్లేష్



మంచాల : మాట్లాడుతున్న క్యామ మల్లేష్

మంచాల, మే 6 : ఎంపీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఇకనైనా చిల్లర మాటలు మానుకోవాలని, లేదంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాలలో ఆదివారం రాత్రి ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి బురిడీ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని గ్రహించిన ప్రజలు బీఆర్ఎస్‌ను గెలుపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కారుగుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, రాష్ట్రనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మండలాధ్యక్షుడు చీరాల రమేష్, ఎంపీపీ నర్మదలచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మరోమారు మోదీ ప్రభుత్వమే



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

ఇబ్రహీంపట్నం, మే 6: కేంద్రంలో మరోమారు మోదీ ప్రభుత్వమే వస్తుందని, ప్రజలంతా కోరుకుంటున్నారని, భువనగిరి ఎంపీగా డా.బూర నర్సయ్యగౌడ్‌ను మంచి మెజార్టీ ఇచ్చి గెలిపించుకుందామని భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ ఓబీసీ మోర్చా మహిళా ఇన్‌చార్జి ఎం.భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం టౌన్‌లో మహిళా మోర్చా నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతుందని, ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ఆయన ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్వేతారెడ్డి, నిట్టు అనిత, బి.ఉమ, లలిత, యాదమ్మ తదితరులున్నారు.

'పోస్టల్ బ్యాలెట్'ను వినియోగించుకోవాలి : ఆర్డీవో

చేవెళ్ల, మే 6 : ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ పేపర్ ఓటింగ్ ప్రక్రియను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విధానం కొనసాగుతుందన్నారు. రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగుతుందన్నారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్ తదిరత మండలాల్లో కలిపి మొత్తం పోస్టల్ బ్యాలెట్ 2,353 ఓట్లు ఉన్నాయని, ఇప్పటివరకు 1,072 ఓట్లు పోలయ్యాయని పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కొనసాగుతుందన్నారు. ఉద్యోగులందరూ ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, ఏవో సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ యూత్ నూతన కార్యవర్గం

యాచారం, మే 6 : యాచారం అంబేడ్కర్ యూత్‌కు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మస్కు శ్రీనివాస్ చెప్పారు. అధ్యక్షుడిగా మస్కు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జోగు గణేష్, అశోక్, కోశాధికారి మస్కు జంగయ్య, ప్రధాన కార్యదర్శులుగా తోటరాజు జోగువంశీ, అధికార ప్రతినిధిగా జోగు మహేష్‌లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

ఓటర్లు టోల్‌ఫ్రీ నంబర్ '1950'ని సద్వినియోగం చేసుకోవాలి

యాచారం, మే 6 : ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటర్ స్లిప్‌ల పంపిణీ, బూత్ నంబర్ వివరాలను తెలుసుకునేందుకు గాను టోల్‌ఫ్రీ నంబర్ 1950కి కాల్ చేసుకునేందుకు వీలుంటుందని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఎస్ఎంఎస్ ద్వారా ఓటరు కార్డు నంబర్‌ను ఎన్నికల సంఘానికి పంపిస్తే జాబితాలో ఓటరు వివరాలు తెలుపుతుందని చెప్పారు. టోల్‌ఫ్రీ నంబర్-1950కి ఎస్ఎంఎస్ చేస్తే.. మీ పేరు, సీరియల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాలు తెలుస్తాయన్నారు. ఈసీఈ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటరు పేరు, ఐడీ నంబర్ టైప్‌చేసి.. 1950కి ఎస్ఎంఎస్ పంపితే సరిపోతుందని చెప్పారు. ఓటర్లు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

యాచారం, మే 6 : మండలంలోని గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఈనెల 8 వరకు సామాజిక తనిఖీ ఉంటుందని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉపాధిహామీ పథకం సిబ్బంది, కూలీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

- రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే ఆధారాలు చూపాలి : పోలీసులు



యాచారం : మాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

యాచారం, మే 6 : ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం మండల పరిధిలోని మాల్‌లో సీఐ శంకర్‌కుమార్, ఎస్సైలు వెంకటనారాయణ, గోపాల్, సత్యనారాయణలు స్పెషల్‌పార్టీ పోలీసులతో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. యాచారం వెళుతున్న వాహనాలతో పాటు మాల్‌కు వస్తున్న వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. ఈ సందర్భంగా లైసెన్స్ లేని డ్రైవర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవర్లు విధిగా తమ వెంట డ్రైవింగ్, పొల్యూషన్, ఆర్‌సీ, తదితర పత్రాలు ఉంచుకోవాలన్నారు. రూ.50వేల నగదు కంటే ఎక్కువ కలిగి ఉంటే తగిన ఆధారాలు పోలీసులకు చూపాలని, లేనిచో సీజ్ చేస్తామన్నారు. వ్యాపారులు తమ వస్తువులు ఎక్కడి నుంచి తెస్తున్నారో తెలియజేసే ఆధారాలు చూపించాలని కోరారు. తనిఖీ చేస్తున్న పోలీసులకు వాహనాదారులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడపరాదని, బెల్టు దుకాణాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల, క్రూయిజర్ల వాహనాదారులు అతివేగంగా నడపరాదని చెప్పారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలి



ఇంటింటి ప్రచారంలో సయ్యద్ ఖలీల్

ఆమనగల్లు, మే 6: పాలనాపరంగా విఫలమై, ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని, ఎంపీగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సయ్యద్ ఖలీల్ అన్నారు. ఆమనల్లు పట్టణంలో సోమవారం ఖలీల్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. గార్లపాటి శ్రీనివాస్, ఎంగళి రఘు, కొమ్ము ప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర జెండాతోనే హక్కుల పోరాటాలు



లోయపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

మంచాల, మే 6 : నిరుపేదల హక్కుల సాధనకు కడదాకా పోరాడేది ఎర్రజెండాయేనని సీపీఎం మంచాల మండల కార్యవర్గసభ్యుడు నిలివేరు రాజు అన్నారు. భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా సోమవారం లోయపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ బూర్జువా పార్టీలు నోట్ల కట్టలతో రాజకీయాలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో సీపీఎం శాఖ కార్యదర్శి ఎం.వెంకటేష్, ఆడెపు వెంకటేష్, ఈరమల్ల వెంకటయ్య, జంగయ్య, బొట్టు జానీ, రవన్న, శివ మణి, చందుపాష, సురేష్, నిఖిల్, రాజు, నవీన్, సమీర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్



తక్కళ్లపల్లితండాలో ప్రచారం చేస్తున్న సుజాత

యాచారం, మే 6 : నిరుపేదలను ఆదుకోవడంతో పాటు పేదరిక నిర్మూలనకు కాంగ్రెస్ పార్టీ పాటుపడుతోందని, దేశంలో పేదలకు భూములు పంచి ఆదుకున్న ఘనత కాంగ్రెస్‌దేనని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పాల్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని తక్కళ్లపల్లి తండాలో పర్యటించి భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరుతూ ఓటర్ల మద్దతు కోరారు. ఆమె మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రగతి కుంటుపడిందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు కృషి చేయాలని కోరారు. అంతకుముందు ఆమె తండాలో బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంగోత్ వెంకటేష్, పార్టీ సేవాదల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మంఖాల దాసు, మస్కు నర్సింహ, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ జి. సురేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



పద్మారంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో ప్రవళిక

చౌదరిగూడ, మే 6 : వేసవి నేపథ్యంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోజుకు మూడు వందల రూపాయలు వచ్చే విధంగా పనులు చేయాలని ఏపీవో ప్రవళిక అన్నారు. సోమవారం మండల పరిధిలోని పద్మారంలో కొనసాగుతున్న ఉపాధి నసులు, నర్సరీని పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం కూలీ డబ్బులను మూడు వందలకు పెంచినట్లు ఆమె వివరించారు. జాబ్ కార్డు కల్గి ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు చేసుకోవచ్చని సూచించారు. టీఏ వినోద్, కార్యదర్శి దీరజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ కళలకు జీవం పోయాలి

తలకొండపల్లి, మే 6: కళలు, కళాకారులు, నాటక ప్రదర్శనలకు ప్రతి ఒక్కరు తోడ్పాటునందించి ప్రోత్సహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో చిరుతల మహాభారతం నాటక ప్రదర్శన కళాకారులను సోమవారం ఆయన అభినందించారు. వారిని శాలువాలతో సత్కరించి ప్రోత్సహకంగా రూ. 5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కళాకారులు శ్రీనివాస్ యాదవ్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి వలసలు



కొత్తూర్ : పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్/చౌదరిగూడ/షాద్‌నగర్ రూరల్/షాద్‌నగర్ అర్బన్/కొందుర్గు/నందిగామ, మే 6: సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మాజీ సర్పంచ్ జె. సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో కొత్తూర్ మాజీ వార్డు సభ్యులు ఆంజనేయులుగౌడ్, పెద్దిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కడెంపల్లి యాదగిరిగౌడ్‌లతో వారి అనుచరులు షాద్‌నగర్‌కు తరలివెళ్లి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని ఇన్ముల్‌నర్వలో కేశంపేట జడ్పీటీసీ, కొత్తూర్ మండల ఇన్‌చార్జి విశాలశ్రవణ్ ఆధ్వర్యంలో వంశీచంద్‌రెడ్డి తరఫున ఇంటింటి ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్‌కు చెందిన 17వ వార్డు కౌన్సిలర్ సర్వర్ పాషా సోమవారం రాత్రి పార్టీలో చేరారు. ఎమ్మెల్యే శంకర్ ఆహ్వానించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుంజల్ పహడ్‌కు చెందిన కృష్ణ షాద్‌నగర్‌లో పార్టీలో చేరారు. మండల నాయకులు వంశీచంద్‌కు మద్దతుగా చౌదరిగూడ, ఎల్కగూడ, పద్మారం, జాకారం నంధ్యాతండా తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు రాజు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి వన్నాడ వెంకటేష్ పార్టీలో చేరారు. రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ తమ యూనియన్ కాంగ్రెస్‌కు పూర్తి మద్దతునిస్తున్నదని తెలిపారు. మంత్రి కొండా సురేఖ, యూనియన్ చైర్మన్ రామినేని శ్రీనివాస రావు, సెక్రటరీ దుర్గా ప్రసాద్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పార్టీకి పూర్తి మద్దతు నిస్తూ రూపొందించిన పోస్టర్‌ను సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించామని వెల్లడించారు. వంశీచంద్‌ను గెలిపించాలని కొందుర్గులో నాయకులు ప్రచారం చేశారు. కె.రాములుగౌడ్, సి.కృష్ణయ్య, రామకృష్ణాగౌడ్, నరేందర్‌గౌడ్, తదితరులున్నారు. వంశీచందర్‌రెడ్డికి మద్దతుగా నాయకులు నందిగామ మండలకేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి నాయకులు కృష్ణ, జంగయ్య, తదితరులున్నారు.

ఎన్కేపల్లి బస్‌షెల్టర్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేపట్టిన అనంతరం బస్‌షెల్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొయినాబాద్ రూరల్, మే 6: ఎట్టకేలకు ఎన్కేపల్లి బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేపట్టారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి చౌరస్తాలోని బస్ షెల్టర్‌ను కొన్నేళ్ల క్రితం నిర్మించగా నిర్వహణ లోపంతో నిరుపయెగంగా మారిందని మార్చి ఒకటిన 'అస్తవ్యస్తంగా ఎన్కేపల్లి బస్ షెల్టర్' అనే కథనాన్ని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దాంతో అదే గ్రామానికి చెందిన చేవెళ్ల సునీల్, ఆమ్డాపూర్ సునీల్, జల్లెల శివకుమార్ అనే యువకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామపంచాయతీ నిధులతో షెల్టర్‌కు మరమ్మతులు దగ్గరుండి చేయించారు. అంతేకాకుండా షెల్టర్ సమీపంలోని చెత్తాచెదారం తొలగింపచేశారు. రంగులను వేయించి ఎన్కేపల్లి పూర్వవైభవం తీసుకువచ్చారు. గ్రామస్థులతో పాటు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు యువకులు చేసిన పనికి అభినందిస్తున్నారు.

ఎట్టకేలకు చెత్త తొలగింపు

మొయినాబాద్ రూరల్ : మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలోని చిలుకూరు బాలాజీ దేవాలయానికి ప్రధాన రోడ్డు పక్కనే ఎక్కడపడితే అక్కడ చెత్తను వేస్తుండడంతో ప్రయాణికులు, వాహనదారుల అవస్థలను గుర్తించి సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పేరుకుపోతున్న చెత్తచెదారం' కథనం ప్రచురితమైంది. స్పందించిన మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎట్టకేలకు స్పందించారు. రోడ్డు పక్కనే చెత్తను పంచాయతీ సిబ్బందితో కలిసి తొలగింపజేశారు.



హిమాయత్ నగర్‌లో రోడ్డుపక్కన ఉన్న చెత్తను తొలగించిన సిబ్బంది

మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకోవాలి



కొందుర్గు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

కొందుర్గు/నందిగామ/కొత్తూర్ మే, 6: మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం కొందుర్గు మండల కేంద్రంలోని జీఎం పటేల్ గార్డెన్ మినీహాల్‌లో బీఆర్ఎస్ కొందుర్గు గ్రామ కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వంకాలయ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, నాయకులున్నారు. మన్నెకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు నందిగామ మండల పరిధిలోని వీర్లపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఎంపీటీసీ లతాశ్రీ శైలం, నాయకుల్గున్నారు. శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలంటూ కొత్తూర్‌లో బీఆర్ఎస్ నాయకులు బి.దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఎంపీటీసీ కృష్ణయ్య, నాయకులున్నారు.

బీజేపీతోనే తండాల అభివృద్ధి



తండావాసులను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, మే 6 : లోక్ సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విజయం సాధిస్తే గిరిజన తండాలు అభివృద్ధి చెందుతాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని పుల్చర్లకుంట తండాకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్ళు తండాల అభివృద్ధిని ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. డీకే అరుణమ్మ గెలిస్తే తండాల అభివృద్ధితో పాటు లంబాడ లిపిని రాజ్యాంగంలో పొందుపర్చడానికి కృషి చేస్తుందని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. నాయకులు తదితరులున్నారు.

సంక్షిప్తంగా

మొయినాబాద్ : కనకమామిడి గ్రామంలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన కౌలురైతు కృష్ణ స్టార్టర్‌ను ఆన్ చేసేందుకు వెళ్లినప్పుడు ప్రమాదం జరగలేదని ట్రాన్స్‌కో ఏఈ హేము తెలిపారు. తన పంటను జంతువుల బారినుంచి కాపాడుకునేందుకు పంట చుట్టు జీఐ వైరుతో చార్జ్ ఏర్పాటు చేశాడని ఆవైరు తగలం మూలంగానే విద్యుత్ షాక్‌కు గురై అతను మృతిచెందాడని తెలిపారు.ఇందులో విద్యుత్ లధికారుల తప్పిదం లేదని ఆయన తెలిపారు.

షాబాద్ : మండల పరిధిలోని చందన్‌వెళ్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఉప్పల మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. జోగిని శ్యామల హాజరై బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు గ్రామస్థులున్నారు.

ఆమనగల్లు : గ్రామీణ క్రీడాకారులకు ప్రతి ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాచూర్‌లో సోమవారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. శ్రీనివాస్ రెడ్డి క్రీడలను ప్రారంభించారు.

ఆమనగల్లు : పిడుగు పాటుకు గురై మృతి చెందిన కావటి పద్మమ్మ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద పిడుగుపాటుకు గురై మృతి చెందిన పద్మమ్మ మృత దేహాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5 వేలు అందించారు.

క్రైం కార్నర్

భర్తను కడతేర్చిన కేసులో భార్య, ఇద్దరు నిందితుల రిమాండ్

శంషాబాద్, మే 6 : అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలసి భర్తను కడతేర్చిన భార్యతో పాటు సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన సైబరాబాద్ కమిషరేట్ కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు శంషాబాద్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియాలో సమావేశంలో డీసీపీ నారాయణరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. బాలాపూర్ మండలం నాదర్‌గుల్ ప్రాంతానికి చెందిన తాండ్ర రవీంద్ర భార్య గీతకు అదే ప్రాంతానికి చెందిన కడారి యాదగిరితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త అక్రమ సంబంధానికి దారితీసింది. వీరికి భర్త రవీంద్ర అడ్డు పడుతున్నాడని, ప్రియుడితో కలసి భర్తను హత్య చేయాలని గీత పథకం వేసింది. దాంతో ఏప్రిల్ 29వ తేదీన గీతా విషాల్ మార్టు వద్ద తన భర్త వేచిచూస్తున్నాడని యాదగిరికి సమాచారం అందించింది. అతడు తన స్నేహితుడు అనిల్‌కుమార్‌ను వెంటపెట్టుకొని తన బాలెనో కారులో అక్కడికి వచ్చాడు. రవీంద్రను బలవంతంగా కారులో ఎక్కించుకొని అతడిపై దాడి చేసి కడ్తాల్ సమీపంలోని బటర్‌ఫ్లై వెంచర్‌లోకి తీసుకెళ్లారు. తీవ్ర గాయాలు కావడంతో రవీంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం ఆనవాళ్లు దొరక్కుండా శవంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అయితే, ఏమీ తెలియనట్లుగా గీత ఏప్రిల్ 30న తన బావ రఘునందన్‌కు ఫోన్ చేసి రవీంద్ర కనపడటంలేదని చెప్పడంతో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం రవీంద్రను హత్యచేశారని పోలీసుల విచారణలో తేలింది. సోమవారం ప్రధాన నిందితుడు కడారి యాదగిరి, చిత్రం అనిల్ కుమార్‌తో పాటు భార్య గీతను అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన బాలెనో కారును వీల్‌రాడ్‌ను మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు పంపినట్లు డీసీపీ తెలిపారు.

అనుమానం పెనుభూతమై.. భార్యను చంపిన భర్త

మొయినాబాద్ రూరల్, మే 6 : అనుమానం పెనుభూతమై.. భర్త కాలయముడై భార్యను అతి కిరాతకంగా చంపాడు. శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డినగర్‌లో వడ్డె మాణిక్యం, యాదమ్మ దంపతులు కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. భర్త మాణిక్యంకు ఇటీవల కాలంలో యాదమ్మపై అనుమానం పెనుభూతంలా మారింది. అప్పటి నుంచి ఆమెను వేధిస్తుండేవాడు. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి యాదమ్మ ఇంటి ఆరుబయట నిద్రిస్తుండగా భర్త మాణిక్యం ఆమె తలపై గ్రానైట్ రాయితో గట్టిగా మోదాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో యాదమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, వారి కూతురు ఆ సమయంలోనే ఇంట్లో నిద్రిస్తోంది. ఇద్దరు కుమారులు ఉండగా పెళ్లిళ్లు కావడంతో వేరే సంసారం పెట్టుకున్నారు. మోకిల సీఐ వీరబాబు, ఎస్సై కోటేశ్వరరావులు సోమవారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించి హత్య జరిగిన తీరును పరిశీలించి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు చెప్పారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

షాద్‌నగర్ రూరల్, మే 6: బాలికపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం తెలిపారు. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాంసాన్‌పల్లికి చెందిన చాకలి యాదయ్య(45) 2023లో మైనర్‌పై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్.. విచారణ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడు రిమాండ్‌లోనే ఉన్నాడు. షాద్‌నగర్ పోక్సో కోర్టులో సోమవారం వాదనలు జరగగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే బాధితురాలికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.7లక్షలు అందించాలని ఆదేశించారు.

మూడిళ్లలో చోరీ

- బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

ఆమనగల్లు, మే 6: మండలంలోని మేడిగడ్డ తండాలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. వేసవి కావడంతో ఉక్కపోతకు తండావాసులు మిద్దెమీద నిద్రిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇళ్లలో చొరబడి బీరువాలు పగలగొట్టి చోరీ చేశారు. తండాకు చెందిన ఇస్లావత్ వినోద్‌కుమార్, రాత్లావత్ సాలి, ఇస్లావత్ రమేశ్‌ల ఇళ్లలో చోరీకి పాల్పడట్లు ఎస్సై బాల్‌రామ్ నాయక్ తెలిపారు. ఆయా చోట్ల రెండున్నర తులాల బంగారం, పది తులాల వెండి ఆభరణాలతో పాటు కొంత నగదు ను దోచుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఎస్సై ఇళ్లను సందర్శించి వివరాలు సేకరించారు. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో వ్యక్తికి ఏడాది జైలు

యాచారం, మే 6 : కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5వేల జరిమానా విధిస్తూ ఎల్ బీనగర్ కోర్టు న్యాయాధికారి భవాని తీర్పు వెలువరించారు. సీఐ శంకర్‌కుమార్, కోర్టు సీడీవో భిక్షపతిల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎండీ హఫీజ్(30) అదే గ్రామానికి చెందిన తలారి యాదయ్యలు డబ్బు విషయంలో గొడవకు దిగారు. కోపోద్రిక్తుడైన ఎండీ హఫీజ్ యాదయ్యను కొట్టి కులం పేరుతో దూషించాడు. దాంతో యాదయ్య పోలీసులను ఆశ్రయించగా పోలీసులు 2006లో ఐపీసీ 323 కింద ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. అప్పటి ఏసీపీ నారాయణ గ్రామంలో సమగ్రంగా విచారించి పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించారు. కేసు వివరాలను విచారించిన ఎల్ బీ నగర్ న్యాయాధికారి భవాని సోమవారం నిందితుడు ఎండీ హఫీజ్‌కు ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొయినాబాద్, మే 6 : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంగళి నర్సింలు(36) ఇటీవల బైక్‌పై వెంకటాపూర్ నుంచి కేతిరెడ్డిపల్లికి వస్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా నిల్వచేసిన మద్యం పట్టివేత

ఆదిభట్ల, మే 6 : అక్రమంగా నిల్వచేసిన మద్యం నిల్వలపై పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రావిరాలలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రావిరాల గ్రామంలో కిరాణ షాపులో అక్రమంగ మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆదిభట్ల ఎస్సై వెంకటేష్ అధ్వర్యంలో పోలీసులు దాడిచేసి రావిరాల శివారులో నిల్వచేసిన 8,118/- విలువచేసే 41 బాటిల్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మద్యం నిల్వచేసిన మహేశ్వరం మండలం రావిరాలకు చెందిన తూళ్ల శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి కిందపడి యువకుడి మృతి

ఆదిభట్ల, మే 6 : బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్రగాయాలపాలై ఓ యువకుడు మృతిచెందగా.. మరో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాగన్నగూడ వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్ మెట్ మండలం రాగన్నగూడకు చెందిన ఇమ్మానియేల్(22) మిత్రుడు నరేష్(33)లు బ్రహ్మణపల్లిలోని చాక్‌లెట్ కంపెనీలో పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం పని ముగించుకొని పల్సర్ బైక్‌పై తిరిగి వస్తుండగా అదుపు తప్పి కిందపడి పోయారు. ఇమ్మానియేల్ తలకు బలమైన గాయాలు కాగా నరేష్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. వనస్థలిపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఇమ్మానియేల్ (22) అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నరేష్‌ను మెరుగైన చికిత్స కోసం ఎల్బీ నగర్‌లోని ప్రయివేటు అస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.